క్లుప్తంగా

విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థులను అభినందిస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు

తాడిపత్రి: మండల పరిధిలోని యర్రగుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 10 పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తాడిపత్రి పెన్షనర్ల సంఘం సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 534 మార్కులు సాధించిన యుగంధర్‌రెడ్డికి రూ.8 వేలు, 509 మార్కులు సాధించిన నాగేంద్ర రెడ్డికి రూ.6 వేలను పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కత్తి లక్ష్మీ నారాయణరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, పెన్షనర్లు సంఘం సభ్యులు వీరారెడ్డి, ఆదినారాయణ స్వామి, సేతు, నారాయణరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు రస్తా ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని గోవిందపల్లిలో పొలాలకు వెళ్లేందుకు రస్తా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. గోవిందపల్లి గ్రామం నుంచి భద్రంపల్లి, సెంట్రల్ జైలు వరకూ ఉన్న పూర్వపు రస్తాను అనంతపురం నగరానికి చెందిన కుమార్ జేసీబీతో చదును చేసి ఆక్రమించాడన్నారు. ఈ దారి గుండా వందలాది మంది రైతులు ఏళ్ల తరబడి పొలాలకు వెళ్లేవారని తెలిపారు. కుమార్ పొలం డీ పట్టా అయినా రోడ్డును ఆక్రమించాడని వాపోయారు. రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ రమాదేవి.. రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, రాము, శ్రీనివాసులు, నారపరెడ్డి, నరసింహారెడ్డి, గంప మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామి హుండీ కానుకల లెక్కింపు



నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి దేవస్థానం నుంచి దేవదాయ శాఖకు రూ.11,12,877 ఆదాయం సమకూరినట్లు దేవదాయశాఖ అధికారి శోభ తెలిపారు. సోమవారం కుళ్లాయి స్వామి దేవాలయంలో హుండీ కానుకలు లెక్కించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ రమణకుమారి, ఎంపీటీసీ రాజారెడ్డి, కో–ఆప్షన్ షాబిరా, లింగారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోండి



జేసీ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ–2 కె.రవికుమార్

తాడిపత్రి అర్బన్: రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి పంచాయతీ పరిధిలో జరిగిన అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన స్పందనలో గన్నెవారిపల్లి ఎంపీటీసీ–2 కె.రవికుమార్ జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితం బదిలీపై వెళ్లిన పంచాయతీ సెక్రెటరీ రమాదేవి పేరిట అక్రమంగా కొందరు కాలనీవాసుల నుంచి ఇంటి, కుళాయి పన్నులు వసూలు చేశారన్నారు. నకిలీ సంతకాలతో రశీదులు కూడా మంజూరు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని స్వాహా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ మాజీ సర్పంచ్ చింబిలి వెంకటరమణ, ప్రస్తుత సర్పంచ్ ఉమా మహేశ్వర్లు పంచాయతీలో పనులు చేయకుండానే చేసినట్లు అక్రమంగా నిధులను స్వాహా చేస్తున్నారని తెలిపారు. రాఘవేంద్ర కాలనీలో 2020 సెప్టెంబర్, అక్టోబర్ మధ్యలో 1600 మీటర్ల అండర్ డ్రైనేజీ పనులను కాలనీ వాసులే సొంత ఖర్చులతో చేయించుకుంటే.. వాటిని కూడా తామే చేయించినట్లు బిల్లులు దిగమింగేశారని ఫిర్యాదు చేశారు.

ఘనంగా చండీహోమం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారిని శాకాంబరీగా అలంకరించారు. చండీ హోమం నిర్వహించారు. 108 మంగళ హారతులు, 108 నీటి బిందెలతో నీళ్లు, 108 నిమ్మకాయలు, 108 ఎర్రగడ్డలతో పూజలు చేపట్టారు.

పవన్‌కు మతి భ్రమించింది

- మహిళలను కించపరుస్తూ మాట్లాడటం సిగ్గుచేటు
- ఆగ్రహం వ్యక్తం చేసిన వలంటీర్లు
- వెంటనే క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం డిమాండ్



గుత్తి: గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం. పవన్ కళ్యాణ్ వెంటనే వలంటీర్లకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం డిమాండ్ చేశారు. పట్టణంలోని తన చాంబర్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఓ పార్టీ అధినేత అయి ఉండి తెల్లవారుజాము నుంచి ఇంటింటికీ వెళ్లి సేవలు అందించే వలంటీర్లను పవన్ కళ్యాణ్ చులకన చేస్తూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మహిళా వలంటీర్లను కించపరుస్తూ వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. అసలు పవన్ కళ్యాణ్‌కు బుద్ధి లేదని ఎద్దేవా చేశారు. ఇలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి కావాలనుకోవడం పగటి కల అన్నారు. ఇలాంటి మనస్తత్వం ఉన్న వ్యక్తి రాజకీయాలకు పనికి రాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. వెంటనే పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారన్నారు. వలంటీర్ల ఆగ్రహానికి గురికాక ముందే క్షమాపణలు చెబితే బాగుంటుందని హితవు పలికారు.



పుట్లూరు: వైఎస్సార్ సర్కిల్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

నల్లబ్యాడ్జీలతో నిరసన..

పుట్లూరు: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఒంటరి మహిళలు, వితంతువుల వివరాలు సంఘ విద్రోహ శక్తులకు అందిస్తున్నారంటూ ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. పవన్‌కళ్యాణ్.. వలంటీర్ల మనోభావాలను కించపరుస్తూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవని వ్యక్తి తనకు నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఎన్నికల్లో ఓటమి వల్ల అతడికి మతి భ్రమించినట్లు ఉందని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అతడ్ని పిచ్చాసుపత్రికి తరలించి వైద్యం అందించాలన్నారు. కరోనా సమయంలో ఎంతో ధైర్యంతో ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించామన్నారు. వలంటీర్ వ్యవస్థను చూసి ఓర్వలేక నిరాధారమైన ఆరోపణలను చేస్తున్నారని విమర్శించారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శించి పవన్‌కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పుట్లూరు, నాగిరెడ్డిపల్లి, నాయకునిపల్లి గ్రామాల వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు వలంటీర్ల నిరసన

గుత్తి: గ్రామ, వార్డు వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు గుత్తి, గుత్తి మండల వలంటీర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసుల నుంచి అనుమతి కూడా తీసుకోవడం జరిగింది. ఉదయం 9 గంటలకు గాంధీ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. గ్రామ, వార్డు వలంటీర్లందరూ నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పామిడి: స్థానిక ఎద్దులపల్లి రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద మంగళవారం వలంటీర్లతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ సచివాలయాల పట్టణ, రూరల్ కన్వీనర్లు బి.ఆసిఫ్, ఎస్.ఆర్ కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ, రూరల్ సచివాలయ వలంటీర్లు నిరసనలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు: సీఎం జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. సోమవారం పాతపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉన్నారంటే.. అది జగనన్న చలవే అని గుర్తు చేశారు. 2024లో అందరం కష్టపడి జగనన్నను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. సీఎం జగన్ అర్హులైన ప్రతి ఇంటికి అమ్మ ఒడి, పంటల బీమా పరిహారం అందించి అండగా నిలిచారన్నారు. యల్లనూరు మండలంలోని 9,800 అన్నదాతలకు రూ.12.19 కోట్ల పంటల బీమా మంజూరైందని పేర్కొన్నారు. బీమా మంజూరులో జిల్లాలో ఐదో స్థానంలో యల్లనూరు ఉందన్నారు. ఈ ఘనత మన జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. జగనన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే ఎల్లో మీడియా ఓర్వలేక పోతోందన్నారు.

పత్రికలు, సోషల్ మీడియాల్లో పిచ్చిరాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు ఎర్రిస్వామిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగాతి విజయ ప్రతాప్‌రెడ్డి, పాతపల్లి సర్పంచ్ సునీత, యల్లనూరు మాజీ సర్పంచ్ ఓబులేసు, నాయకులు పాతపల్లి నాగార్జునరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, పురుషోత్తం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీఐజీతో ఎమ్మెల్యే వైవీఆర్ భేటీ



డీఐజీ అమ్మిరెడ్డిని కలసిన ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డిని అనంతపురంలోని ఆయన చాంబర్‌లో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతి భద్రతలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

పరామర్శ

గుంతకల్లు రూరల్: మండలంలోని సంగాల గ్రామానికి చెందిన అంజనిరెడ్డి రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైవీఆర్ సోమవారం అతడ్ని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

పామిడి: ఎద్దులపల్లికి చెందిన మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైవీఆర్ సోమవారం వేణుగోపాల్‌రెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

జేసీ.. చిల్లర రాజకీయాలు మానుకో



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిపత్రి: నిత్యం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని చదువులేనోడు అని వాగే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పెద్ద చదువులు చదువుకున్న మూర్ఖుడని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దేవా చేశారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలూరు రామేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఇటీవల జేసీ ప్రభాకర్ రెడ్డి పదే పదే ఎమ్మెల్యే కుటుంబానికి క్రాప్ ఇన్సూరెన్స్ మంజూరుపై అసత్య వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్‌పై అవగాహన లేకుండా మాట్లాడటం చూస్తుంటే జేసీ ప్రభాకర్‌రెడ్డి అంత మూర్ఖుడు లేడు అనిపిస్తోందన్నారు. ప్రభుత్వం వాతావరణ ఆధారిత క్రాప్ ఇన్సూరెన్స్‌ను మంజూరు చేసిందన్నారు. ఆర్బీకేల ద్వారా నమోదు కాబడిన పంటలన్నింటికీ వర్తిస్తుందన్న విషయాన్ని కూడా జేసీ తెలుసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీఓను తెప్పించుకుని చదువుకోవాలని సూచించారు. చదవడం రాకపోతే విదేశాల్లో చదువుకున్న కుమారుడితో అయినా చదివించుకోవాలని హితవు పలికారు. కాయలు కాయకుండానే క్రాప్ ఇన్సూరెన్స్ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఎలా వస్తుంది? అసలు మొక్కలే లేకుండా ఎలా ఇస్తారంటూ మాట్లాడటం సరికాదన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. పంటలు సాగు చేసిన వారు పంటలను ఆర్బీకేల్లో నమోదు చేసుకుని ఉండాలన్నారు. ఆయా ప్రాంతానికి క్రాప్ ఇన్సూరెన్స్ వర్తింపు జరిగినప్పుడు రైతులందరికీ ఎకరానికి కొంత మొత్తం చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. బీమా మంజూరులో తారతమ్యాలు ఉండవని స్పష్టంగా జీఓలో ఉందని తెలిపారు. చేతనైతే జీఓ కాపీ చదువుకుని మాట్లాడాలన్నారు. అన్నీ నాకే తెలుసు అంటూ అహంకారంతో మాట్లాడితే ఇలాంటి ఛీత్కరింపులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, పేరం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

యల్లనూరు: మండలంలోని జంగంపల్లి, వెంకటాద్రిపల్లి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పథకాలను వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 35వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వచ్చి పథకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాఘవేంద్ర, నాయకులు జావిద్, నాగభూషణం, సునిల్, రాజారెడ్డి, పేరం ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత..

తాడిపత్రి: తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలుగా మారిన చిన్నారులకు ఆర్థికసాయం అందజేసి పెద్ద మనస్సు చాటుకున్నారు యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి. వివరాలు.. తిరుపతి పట్టణంలో నివాసం ఉంటున్న ప్రభు, నాగవేణి దంపతులు కొంత కాలం క్రితం మరణించారు. దీంతో వారి నలుగురు పిల్లలైన అఖిల, అమృత, అఖిల్, ఈశ్వర్ అనాథలుగా మారారు. తాడిపత్రి పట్టణంలోని 35వ వార్డులో ఉంటున్న అమ్మమ్మ వద్ద ఉన్నారు. విషయం తెలుసుకున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఇంటికి వెళ్లి చిన్నారులతో మాట్లాడారు. అనంతరం రూ. 20 వేల ఆర్థికసాయం అందజేశారు.

యువతి అదృశ్యం

పెద్దవడుగూరు: గంజిగుంటపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున రెడ్డి కుమార్తె సుహాసిని (19) అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో వివరాలు ఇలా ఉన్నాయి. సుహాసిని అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా సుహాసిని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ తెలిసిన వారు 9440796826 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు ఆత్మహత్య



నాగిరెడ్డి (ఫైల్)

గుత్తి రూరల్: మండలంలోని గాజులపల్లిలో సోమవారం ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వరిమడుగు నాగిరెడ్డి (62) అనే రైతు తనకున్న తొమ్మిది ఎకరాల పొలంలో పత్తి సాగు చేశాడు. గత మూడేళ్లుగా పంటల దిగుబడి తగ్గింది. పంటల సాగుతో పాటుగా కుటుంబ పోషణకు రూ.10 లక్షల వరకూ అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని నాగిరెడ్డి మదనపడేవాడు. మానసికంగా కృంగిపోయిన అతడు సోమవారం ఇంట్లోని క్రిమిసంహారక మందు సేవించాడు. అనంతరం పొలం వద్దకు వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స ప్రారంభించేలోపు రైతు మృతి చెందాడు. మృతుడికి భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రైతు కుటుంబాన్ని సర్పంచ్ వాసుదేవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరాముడు, గురు ప్రసాద్ పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తరిమెల–చిట్టూరు బ్రిడ్జి పనుల పరిశీలన



బ్రిడ్జి నిర్మాణ వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ తలారి రంగయ్య

శింగనమల: శింగనమల, పెద్దవడుగూరు మండలాలకు రాకపోకలు సాగించేందుకు తరిమెల–చిట్టూరు గ్రామాల మధ్యలో పెన్నానదిలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఎంపీ తలారి రంగయ్య సోమవారం పరిశీలించారు. బ్రిడ్జి కోసం దాదాపు రూ.3.76 కోట్ల ఎంపీ నిధులు కేటాయించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తరిమెల రామకృష్ణ, సర్పంచ్ ఓబిలేసు పాల్గొన్నారు.

పరామర్శ..

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి సతీమణి రాధమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఎంపీ తలారి రంగయ్య సోమవారం అమరేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డిని పరామర్శించారు. అలాగే రాధమ్మ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, శింగనమల మాజీ జెడ్పీటీసీ రామకృష్ణ, ఎల్లారెడ్డి, చీమల శ్రీనివాసులు, షేక్షావలి, పాల్గొన్నారు.

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

తాడిపత్రి అర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 16 పాఠశాలలకు చెందిన బాలురు పాల్గొన్నారు. మొదటి రోజు ట్రిపుల్‌ఎస్ పాఠశాల, సాయివిజేత పాఠశాల జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్‌లో ట్రిపుల్‌ఎస్ పాఠశాల 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 87 పరుగులు సాధించింది. సాయి విజేత హైస్కూల్ జట్టు 82 పరుగులకు ఆలౌట్ అయింది. ట్రిపుల్‌ఎస్ జట్టు ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. విద్యార్థి అమర్నాథ్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ దక్కించుకున్నాడు. రెండో మ్యాచ్‌లో పద్మవాణి హైస్కూల్ జట్టు, చర్చి స్కూల్ జట్లు తలపడ్డాయి. పద్మవాణి స్కూల్ జట్టు 6 వికెట్లు కోల్పోయి 93 పరుగులు సాధించింది. చర్చి స్కూల్ జట్టు ఎనిమిది వికెట్లకు 91 పరుగులు మాత్రమే చేసింది. పద్మవాణి స్కూల్ జట్టు రెండు పరుగుల తేడాతో విజయం సాధించింది. నరేంద్ర మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ సాధించాడు. మూడో మ్యాచ్‌లో నారాయణ స్కూలు, సూర్య స్కూలు జట్లు తలపడ్డాయి. నారాయణ స్కూల్ జట్టు విజయం సాధించింది. ఏటీఎల్ రామాంజనేయులు బహుమతులను అందజేశారు.

ఖైదీలకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం అనురాధ

బుక్కరాయసముద్రం: జైలులో ఉన్న ఖైదీలకు నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపడుతామని నాబార్డు డీడీఎం అనురాధ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని జిల్లా జైల్లో ఆర్థిక సాక్షరత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జైలు సూపరింటెండెంట్ రెహ్మాన్ అధ్యక్షత వహించారు. నాబార్డ్ డీడీఎం మాట్లాడుతూ.. ఖైదీలకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. మహిళా ఖైదీలకు కుట్ల శిక్షణ, ఎంబ్రాయిడరీ, మగ్గం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏడీసీసీ బ్యాంక్ వారు ఖైదీలకు సేవింగ్స్ ఖాతాలు ప్రారంభించేలా చర్యలు చేపడుతామన్నారు. ఏడీసీసీ బ్యాంక్ జీఎం సురేఖ రాణి మాట్లాడుతూ.. ఖైదీలకు శిక్ష ముగిసిన తరువాత రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఓల్డ్‌టౌన్ బ్రాంచ్ మేనేజర్ సునీత, సూపర్‌వైజర్ గిరి, పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంతకల్లుటౌన్: ప్రధాన్‌మంత్రి కౌశల్ యోజన స్కిల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ టి.నరేంద్రనాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై ఆపై ఉన్నత చదువులు చదివిన వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం ఐటీఐలో సంప్రదించాలన్నారు.

పచ్చిమేతతో అధిక పాల దిగుబడి



గుడ్డాలపల్లిలో పశువులకు వైద్య చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

గార్లదిన్నె: పాడి ఆవులకు పచ్చిమేత వేయడం వల్ల అధిక పాల దిగుబడి సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గుడ్డాలపల్లిలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులు తప్పనిసరిగా పచ్చిగడ్డి, కాయ జాతి గడ్డితో పాటు పప్పు జాతి గడ్డిని కూడా పెంచుకోవాలన్నారు. కాయ జాతిలో ఆస్ట్రేలియా రెడ్ నేపియర్, స్మార్ట్ నేపియర్, సూపర్ నేపియర్ సీఓ ఎఫ్ఎస్ 33 రకాలు ఉన్నాయన్నారు. పప్పుజాతిలో సుబాబుల్, స్టైలోహేమాట, అవిసె, దశరతి రకాలు ఉన్నాయన్నారు. గడ్డి జాతి రకాలన్నీ రెడ్డిపల్లిలో రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. 30 పశువులకు చికిత్స చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో శింగనమల పశు సంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ పద్మానాభం, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణాధికారి డాక్టర్ సుధాకర్, గార్లదిన్నె పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భర్తపై కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కేసులో భర్తపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌చార్జి సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణానికి చెందిన చిన్ని ప్రసన్నకు పామిడికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తితో ఏడాదిన్నర కిందట వివాహమైంది. శ్రీకాంత్ వ్యాపారం చేస్తుండేవాడు. వీరికి సంతానం లేదు. కొద్ది రోజుల నుంచి శ్రీకాంత్ తన భార్య చిన్ని ప్రసన్నను అదనపు కట్నం కోసం వేధించసాగాడు. ఈ విషయాన్ని ప్రసన్న తన తల్లిదండ్రులకు చెప్పింది. ఎలాగోలా సర్దుకుని సంసారం చేయాలని తల్లిదండ్రులు కూతరు ప్రసన్నకు సూచించారు. అయినా శ్రీకాంత్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో చిన్ని ప్రసన్న సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉన్నతస్థాయికి చేరుకోండి

గుంతకల్లు రూరల్: విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎస్ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపల్ పి.గోపాల్ పేర్కొన్నారు. బళ్లారిలో ఈనెల 8వ తేదీన 2023 విశ్వమయ హస్త అనే పేరుతో నిర్వహించిన మేనేజ్‌మెంట్ ఫెస్టివల్‌లో శ్రీశంకరానందగిరీ డిగ్రీ కళాశాల విద్యార్థులు టీం బిల్డింగ్ అంశంలో ప్రథమ బహుమతి దక్కించుకున్నట్లు తెలిపారు. సోమవారం బహుమతి సాధించిన విద్యార్థులను అభినందించారు.

'జగనన్న సురక్ష'తో పేదలకు మేలు

గుంతకల్లు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం పేదలకు వరంగా మారిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని పేర్కొన్నారు. సోమవారం పలు వార్డుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున హాజరయ్యారు. పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ 11 రకాల సర్టిఫికెట్లు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మైమూన్‌బీ, పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

పామిడి: సీఐ రాజశేఖర్‌రెడ్డిని సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.నారాయణరెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.మధుసూదన్‌రెడ్డి తదితరులు సీఐని సన్మానించారు. పార్టీ యువనాయకులు హరినాథ్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశాన్ని విశ్వగురువుగా నిలపడమే లక్ష్యం

తాడిపత్రి: దేశాన్ని విశ్వగురువుగా నిలపడమే ఏబీవీపీ లక్ష్యమని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అఖిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ స్టేషన్ సర్కిల్ నుంచి యల్లనూరు రోడ్ సర్కిల్ వరకూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నేషన్ ఫస్ట్, సెల్ఫ్ నెక్స్ట్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి హరి నారాయణ, నగర ఉపాధ్యక్షులు మనోజ్, నాయకులు సాయి కార్తీక్, సుధీర్, మంజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలిపై విచారణ

పెద్దవడుగూరు: మండల పరిధిలోని క్రిష్టిపాడు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు రమణమ్మపై విచారణ చేపట్టినట్లు ఎంఈఓ–2 గురుప్రసాద్ తెలిపారు. గత కొద్ది రోజులుగా పాఠశాలలో విద్యార్థుల తల్లిండ్రులు, పారిశుధ్య కార్మికురాలికి మధ్య జరుగుతున్న గొడవలు తారాస్థాయికి చేరాయన్నారు. పారిశుధ్య కార్మికురాలి ప్రవర్తనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.